


# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 247 | మార్చ్ 26 గురువారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# అక్రమాలు బయటపడటంతో అయోమయంలో మంథని ప్రిన్సిపాల్!?



గుట్టుచప్పుడు కాకుండా లెక్చరర్లతో రహస్య మంతనాలు!?

అవినీతి అక్రమాలు వెలుగులోకి రావడంతో తల పట్టుకుంటున్న ప్రిన్సిపాల్!?

లీకులు ఎవరిస్తున్నారంటూ లెక్చరర్ లపై ప్రిన్సిపల్ గుర్రు!?

ప్రశ్నిస్తే ప్రశ్నే... సమాధానం మాత్రం లేదు!

అంతర్గత కలహాలతో అస్థిరంగా మారిన విద్యాసంస్థ

లెక్చరర్లపై ఒత్తిడి... భయాందోళనలో సిబ్బంది

నిజాలు బయటపడుతుండటంతో ప్రిన్సిపాల్ టెన్షన్

గోప్య సమావేశాల వెనుక అసలు అజెండా ఏమిటి?

లీకుల వేటలో ప్రిన్సిపాల్... ఎవరిపై నజర్?

విచారణ జరిగితే మరిన్ని నిజాలు బయటపడే అవకాశం

**మన దునియా,పెద్దపల్లి జిల్లా, మంథని:మార్చి 25**

మంథని ప్రాంతంలోని జిజెసి విద్యాసంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు వరుసగా వెలుగులోకి వస్తుండటంతో ఆ సంస్థ ప్రిన్సిపాల్ తీవ్ర అయోమయంలో ఉన్నట్టు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారినట్టు తెలుస్తోంది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ వ్యవహారం మరింత బయటకు పొక్కకుండా ఉండేందుకు ప్రిన్సిపాల్ గుట్టుచప్పుడు కాకుండా లెక్చరర్లతో రహస్యంగా మంతనాలు జరుపుతున్నారని తెలుస్తోంది. అక్రమాలపై సమాచారం లీక్ కాకుండా ఎలా నియంత్రించాలన్న దానిపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.ఇక సమాచారం బయటకు వెళ్లడంపై అనుమానంతో కొందరు లెక్చరర్లపై ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిసింది. కొన్ని సందర్భాల్లో వారిని ప్రత్యేకంగా పిలిపించి వివరణ కోరినట్టు సమాచారం.ఈ వ్యవహారం మరింత ముదిరే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఉన్నతాధికారులు స్పందిస్తారా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గుట్టుచప్పుడు కాకుండా లెక్చరర్లతో రహస్య మంతనాలు

గుట్టుచప్పుడు కాకుండా లెక్చరర్లతో రహస్య మంతనాలు కొనసాగిస్తున్న ప్రిన్సిపాల్‌పై అనుమానాలు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి. ఇటీవల వెలుగులోకి వస్తున్న అక్రమాల నేపథ్యంలో పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై కొంతమంది నమ్మకస్తులైన లెక్చరర్లతో గోప్యంగా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.ఈ రహస్య సమావేశాల్లో లీకులు ఎక్కడి నుంచి జరుగుతున్నాయనే విషయంపై ప్రధానంగా చర్చ జరుగుతోందని తెలుస్తోంది. ఎవరు సమాచారం బయటకు పంపుతున్నారనే అనుమానంతో కొంతమంది లెక్చరర్లపై ప్రిన్సిపాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు ప్రచారం ఉంది.ఇక ఈ వ్యవహారం విద్యాసంస్థలో ఉద్రిక్త వాతావరణానికి దారితీస్తుండగా, సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయని తెలిసింది. అధికారులు దీనిపై దృష్టి సారిస్తారా లేదా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

అవినీతి అక్రమాలు వెలుగులోకి రావడంతో తల పట్టుకుంటున్న ప్రిన్సిపాల్

అవినీతి, అక్రమాలు వరుసగా వెలుగులోకి రావడంతో ప్రిన్సిపాల్ తీవ్ర ఆందోళనలో ఉన్నట్టు సమాచారం. సంస్థలో జరుగుతున్న అనియంత్రిత చర్యలు బయటపడుతుండటంతో పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ఆయన తల పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది.ఇటీవలి పరిణామాలతో అధికారుల దృష్టి ఈ వ్యవహారంపై పడటంతో పాటు, అంతర్గతంగా

## మూసీ తీరాన ఓంకారేశ్వర క్షేత్రం.. 28న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో తొలి అడుగుగా, గండిపేట మండలం మంచిరేవులలో భారీ ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ఈ నెల 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మూసీ తీరాన్ని మత సామరస్యానికి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ బృహత్కార్యాన్ని చేపడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం పశ్చిమాన జంట జలాశయాల



## ఇరాన్‌తో యుద్ధానికి తెరపడే సమయం.. 15 సూత్రాల శాంతి ప్రణాళికను పంపిన అమెరికా

ఇరాన్‌తో నెల రోజులుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా కీలక ముందడుగు వేసింది. యుద్ధాన్ని నిలిపివేసి, అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు



## కవిత కొత్త పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు

**మన దునియా,హైదరాబాద్: మార్చి 25**

హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే




## రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి: హరీశ్ రావు సవాల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# కవిత కొత్త పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది..

# రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి: హరీశ్ రావు సవాల్

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

# మూసీ తీరాన ఓంకారేశ్వర క్షేత్రం.. 28న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు 55 కిలోమీటర్ల పొడవున మూసీ అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా మంచిరేవులలో ఆలయంతో పాటు, పురానాపూల్ వద్ద భారీ మసీదు, గౌలిగూడలో గురుద్వారా, నాగోల్‌లో చర్చి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. మంచిరేవులలో 800 ఏళ్ల వీరభద్రస్వామి, 1400 ఏళ్ల మచిలేశ్వర ఆలయాల సమీపంలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొత్త ఆలయాన్ని నిర్మిస్తున్నారు. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సలహాలతో ఆలయ నిర్మాణ శైలిని ఖరారు చేశారు. 64 అడుగుల ఎత్తుతో నిర్మించే దీని గర్భాలయం, యాదాద్రి తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్దదిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆలయం వద్ద 2,000 వాహనాల పార్కింగ్, ఓఆర్ఆర్ నుంచి విశాలమైన రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, మూసీ నదిపై చిన్న ఆనకట్ట నిర్మించి, నీటిని నిల్వ చేస్తారు. నది మధ్యలో ఏర్పాటు చేసే ఓ దీవిపై 100 అడుగుల శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు, బోటింగ్ సౌకర్యం, పార్కులను కూడా అభివృద్ధి చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ. 700 కోట్లుగా అంచనా వేస్తుండగా, నిధుల సమీకరణకు దాతలు, ప్రైవేటు సంస్థల సహకారం తీసుకోనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల 28న ఉదయం 8:30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి శృంగేరి పీఠం ప్రతినిధులు హాజరుకానున్నారు.

# అందుకే పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు: తెలంగాణ మంత్రి

ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్లే బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయని, గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందిలేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మవద్దని కోరారు. చమురు కంపెనీలు కూడా సరిపడా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నాయని అన్నారు. అసెంబ్లీలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వదంతుల కారణంగా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కొనుగోలు చేయడంతో బంకుల్లో రద్దీ నెలకొందని అన్నారు. క్యాన్లు, కంటైనర్లలో ఇంధనాన్ని తీసుకువెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో హాస్టళ్లు, ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా పని చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఏ బంకును కూడా మూసివేయడానికి అనుమతించలేదని అన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రంతో మాట్లాడుతున్నట్లు మంత్రి తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.



# అక్రమాలు బయటపడటంతో అయోమయంలో మంథని ప్రిన్సిపాల్!?

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఒత్తిడి పెరిగినట్టు సమాచారం. అక్రమాలపై వివరాలు బయటకు ఎలా వస్తున్నాయన్న అనుమానంతో కొంతమంది సిబ్బందిపై ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక ఈ వ్యవహారం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తుండగా, సంబంధిత శాఖలు విచారణకు దిగితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానిక వర్గాలు భావిస్తున్నాయి.

లీకులు ఎవరిస్తున్నారంటూ లెక్చరర్ లపై ప్రిన్సిపల్ గుర్రు

లీకులు ఎవరు చేస్తున్నారనే అనుమానంతో లెక్చరర్లపై ప్రిన్సిపల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల వెలుగులోకి వస్తున్న అంశాల నేపథ్యంలో సమాచారం బయటకు ఎలా వెళ్తుందన్న దానిపై ఆయన దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అంతర్గత విషయాలు బయటకు చేరడంపై అసహనం వ్యక్తం చేస్తూ, కొందరు లెక్చరర్లను నేరుగా ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో విద్యాసంస్థలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు సమాచారం. ఇక లెక్చరర్లు మాత్రం తమకు సంబంధం లేదని చెబుతుండగా, అసలు లీకులు ఎక్కడి నుంచి జరుగుతున్నాయన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పరిస్థితి ఎలా మలుపుతీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# ఇరాన్‌తో యుద్ధానికి తెరపడే సమయం.. 15 సూత్రాల శాంతి ప్రణాళికను పంపిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

15 సూత్రాలతో కూడిన ఒక విస్తృత ప్రణాళికను ఇరాన్‌కు పంపింది. మరోవైపు, ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఈ ప్రతిపాదనలను పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు చేరవేశారు. ఈ ప్రణాళిక ప్రకారం ఇరాన్ తన మూడు ప్రధాన అణు కేంద్రాలైన నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోలను పూర్తిగా మూసివేయాలి. యురేనియం శుద్ధిని నిలిపివేసి, ఇప్పటివరకు శుద్ధి చేసిన అణు ఇంధనాన్ని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అప్పగించాలి. బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని కూడా నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేసింది. ఈ షరతులకు అంగీకరిస్తే ఇరాన్‌పై విధించిన అన్ని అణు సంబంధిత ఆంక్షలను ఎత్తివేస్తామని అమెరికా హామీ ఇచ్చింది. అంతేకాకుండా, విద్యుత్ ఉత్పత్తి కోసం బుషెహర్‌లో పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడానికి మద్దతు ఇస్తామని తెలిపింది. ఆంక్షలను తిరిగి విధించే "స్నాప్‌బ్యాక్" విధానాన్ని కూడా రద్దు చేస్తామని పేర్కొంది. ఈ అంశంపై అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం మాట్లాడుతూ "వారు ఒక ఒప్పందం చేసుకోవాలనుకుంటున్నారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ సమకూర్చుకోకుండా ఉండేందుకు అంగీకరించారు" అని పేర్కొన్నారు. అయితే, దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ఇజ్రాయెల్, కువైట్, సౌదీ అరేబియా వంటి దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోందని, ఇరు దేశాల మధ్య ఇంకా చాలా దూరం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# హైదరాబాద్‌లో పెట్రోల్ పానిక్.. బంకుల వద్ద బారులు తీరిన వాహనాలు

హైదరాబాద్‌లో ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ కోసం జనం బారులు తీరారు. యుద్ధం కారణంగా ఇంధన కొరత ఏర్పడిందనే వదంతులు వేగంగా వ్యాపించడంతో నగరవాసులు ఆందోళనకు గురయ్యారు. దీంతో తమ వాహనాల్లో ఫుల్ ట్యాంక్ చేయించుకునేందుకు పెట్రోల్ బంకులకు పోటెత్తారు. ఫలితంగా నగరంలోని దాదాపు అన్ని బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలు ఏర్పడ్డాయి. కూకట్‌పల్లి, అమీర్‌పేట, సికింద్రాబాద్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, సనత్‌నగర్, ఎర్రగడ్డ, అబిడ్స్ సహా పలు ప్రధాన ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి వాహనదారులు క్యూలలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో కొన్ని బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించడంతో ప్రజల ఆందోళన మరింత పెరిగింది. ఈ పరిణామంపై అధికారులు స్పందించారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరానికి అవసరమైనంత ఇంధనం నిల్వలు ఉన్నాయని, ఎవరూ



ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పుకార్ల కారణంగానే ఈ కృత్రిమ రద్దీ ఏర్పడిందని అధికారులు తెలిపారు.

# రాజకీయాలను పక్కనపెట్టి.. భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. ఈరోజు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్ళీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఆటోల అనుమతి రద్దు చేసే యోచన

**కొండపైకి వెళ్లేందుకు ఒక్కో ఆటోకు ఏటా రూ.18 వేల రుసుం వసూలు**

**రోజుకు 287 ఆటోలకు అనుమతి**

**14 నెలలుగా రూ. 60.27 లక్షల బకాయి**

**ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇచ్చిన హామీకి బ్రేక్**

**మన దునియా యాదగిరిగుట్ట,మార్చి 25**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపైకి భక్తులకు తరలించేందుకు వెళ్లే ఆటోల అనుమతిని దేవస్థాన అధికారులు రద్దు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. 14 నెలలుగా దేవస్థానానికి ఇవ్వాల్సిన రుసుం పెండింగ్‌లో ఉంది. సుమారు రూ. 60.27 లక్షలు బకాయిలను ఆటో కార్మికులు చెల్లించాల్సి ఉంది. కొన్ని నెలలుగా నోటీసులు ఇచ్చినా ఆటో కార్మికులు స్పందించక పోవడంతో అనుమతిని రద్దు చేయాలని దేవస్థాన అధికారులు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అధికారంలోకి రాగానే కొండపైన ఆటో కార్మికులకు ఎన్నికల సమయంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఇచ్చిన హామీకి ఆదిలోనే బ్రేక్ పడే అవకాశం ఉంది.

**పెండింగ్‌లో రూ.60.27 లక్షలు..**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ పునర్నిర్మాణం తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ సేవలను ప్రారంభించింది. గుట్ట నూతన బస్టాండ్, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, పార్కింగ్ ప్రాంతంలో భక్తులు ఆర్టీసీ బస్సు ఎక్కితే ఉచితంగా కొండపైకి తరలిస్తున్నారు. డబ్బులు చెల్లించే అవసరం లేకుండా ఉండటంతోపాటు ఘాట్ రోడ్ల పనులు కొనసాగుతుండటంతో ఎక్కువ మంది భక్తలను ఎక్కించుకొని వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగే అవకాశం ఉండటం, కొండపైన స్థలం తక్కువ ఉండటం వంటి పలు ప్రధాన అంశాలు, భక్తుల భద్రత దృష్ట్యా కొండపైకి ఆటోల అనుమతిని రద్దు చేసింది. అనంతరం ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్‌తో అనుమతిని ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించింది. ఇంతలోనే ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. ఆటోలను కొండపైకి అనుమతినిస్తామంటూ ఎన్నికల సమయంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీనివ్వడం అమలులో గతంలో మాదిరిగా దేవస్థానానికి ఒక్కో ఆటో చొప్పున రుసుం చెల్లించాలని ఒప్పందం కుదిరింది. మొత్తం కొండపైకి 296 ఆటోలకు అనుమతినిచ్చారు. ఇందులో 9 మంది ఆటో యూనియన్ నాయకుల ఆటోలకు రుసుంను మినహాయింపు నిచ్చారు. మిగతా 287



ఆటోలకు రుసుంను విధిస్తూ కొండపైకి భక్తులకు తరలిస్తున్నాయి. 287లో ఒక్కొక్క ఆటోకు నెలకు రూ.1500 ఉండగా ప్రతి ఏటా రూ.18 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం కలిపి నెలకు రూ.4,30,500 దేవస్థానం నిత్యన్నదానం ఖాతాలో జమ చేయాలి. 2024 ఫిబ్రవరి నుంచి 2025 జనవరి వరకు మాత్రమే చెల్లించారని దేవస్థాన గణాంకాలు చెబుతున్నాయి. మిగతా 2025 నుంచి మార్చి 2026 వరకు 14 నెలలు రుసుం రూ.60.27 లక్షలు నగదు పెండింగ్‌లో ఉన్నాయని దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే కొండపైకి ఆటోల అనుమతిని పూర్తిస్థాయిలో రద్దు చేసేందుకు దేవస్థాన అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే హామీకి బ్రేక్


ఎన్నికల సమయంలో యాదగిరికొండపైన ఆటో యూనియన్ కార్మికులకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే కొండపైకి వాహనాలను అనుమతినిచ్చి ఆటో కార్మికులకు అండగా నిలుస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి రాగానే 2024 ఫిబ్రవరి 11న కొండపైకి ఆటోలను వెళ్లేందుకు అనుమతిని సైతం మంజూరు చేసి ప్రారంభించారు. ఆటోలో అధికారులను ఎక్కించుకొని ఎమ్మెల్యే స్వయంగా కొండపైకి నడిపించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అనుమతికి ఒక్కో ఆటోకు నెలకు రూ.1500 చెల్లించాలని షరతులు పెట్టడంతో కార్మికుల కాస్త ఇబ్బందిపడ్డారు. తప్పని పరిస్థితిలో ఒప్పుకున్నారు. కానీ, ఉచిత బస్సులు ఉండటంతో ఆటోలకు ఆదరణ అంతంత మాత్రమే ఉంది. దీంతో దేవస్థానానికి చెల్లించాల్సి రుసుంను చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. దాదాపు 14 నెలలుగా ఇవ్వాల్సిన రుసుం రూ. 60.27 లక్షలకు పెరిగింది. ఇంత మొత్తం చెల్లించాలా..? ఎలా..? అనే ఆలోచన కార్మికులు ఉన్నట్లుగా సమాచారం. హామీ ఇచ్చిన్నట్టే ఇచ్చి ఈ కొర్రిలేంటని గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

# మాకు ఉండడానికి సొంత ఇల్లు లేదు!

**డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఖాళీ చేసే ప్రసక్తే లేదు!**

**మన దునియా,కరీంనగర్ జిల్లా:మార్చి 25**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ధర్మారం గ్రామంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులు ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారు. కొందరు అధికారులు లు ఇండ్లు ఖాళీ చేయమని ఇబ్బంది పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు సొంత ఇండ్లు లేవని ప్రభుత్వ అధికారు లకు ఎన్నిసార్లు విన్నవిం చుకున్నా మా గోడు ఎవరు పట్టించుకోవడంలేదు అర్హత ఉన్న మాకు ఇల్లు ఎందుకు కేటాయించడం లేదని వారు వాపోయారు. మాకు ఉండడానికి సొంత ఇల్లు కట్టుకోవడానికి సొంత భూమి లేదు ఇల్లు లేక నా నా ఇబ్బందులు పడుతూ కిరాయి చెల్లించలేక విధి లేని పరిస్థితిలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ లు ఆక్రమించుకున్నట్లు తెలిపారు. అధికారులు వచ్చి ఇండ్లు ఖాళీ చేయమంటున్నారు. మేము ఎక్కడికి వెళ్లాలి అని వారు వాపోయారు ఇది ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమమే అయినా మాకు వేరే గత్యంతరం లేక డబుల్ బెడ్ రూమ్ ఇంట్లోకి వచ్చామని వారు అన్నారు. ప్రభుత్వానికి మా గోడు తెలిసే విధంగా ఇక్కడే వచ్చి ఇండ్లను శుభ్రం చేసుకొని నివసిస్తామని నిర్మించిన ఇండ్లను ఎందుకు పంపిణీ చేయడం లేదు.. గత ఏడు సంవత్సరాల నుండి అర్హులైన తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎందుకు కేటాయించడం లేదని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వం అర్హత కలిగిన నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు నిర్మించి ఇస్తామని నిర్మించిన ఇండ్లు పూర్త యిన కానీ పంపిణీ చేయ కుండా నిరుపయోగంగా ఉంచడంపై స్థానికులు మండిపడ్డారు. గత ప్రభుత్వం నిర్మించిన ఇండ్లు పంపిణీ కాకుండా



మళ్లీ కొత్తగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే వాటిని సొంత స్థలం ఉన్న వాళ్ళే నిర్మించుకుం టున్నారని అన్నారు.మాకు స్థలం లేదు కాబట్టి మాకు ఈ నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇండ్లు ఖాళీ చేసే ప్రసక్తే లేదు.. చాలా ఏళ్లుగా ఇండ్లు లేక చాలా యాతన అనుభవిస్తున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం స్థలం లేక ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోలేని నిరుపేద పేదవారికి ఈ ఇండ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు, అధికారులు ఎలాగూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయడం లేదని ఖాళీగా ఉన్నా ఇండ్లలో నివాసం ఏర్పరచుకోవడా నికి ఇక్కడికి వచ్చి ఇందు లో నివసిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు తమను ఇండ్లు ఖాళీ చేయమంటే ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరిస్తున్నారు.

# వరంగల్ జిల్లా జిల్లాలో స్కానింగ్ సెంటర్ నిర్వాకం

**కడుపు నొప్పితో ఉన్న బాలిక గర్భవతి తప్పుడు రిపోర్టు.**

**మన దునియా,నర్సంపేట:మార్చి 25**

నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో తీవ్ర నిర్లక్ష్యం వెలుగుచూసింది. కడుపు నొప్పితో వచ్చిన చిన్నారి బాలికకు గర్భిణీగా ఉందని, తప్పుడు రిపోర్ట్ ఇవ్వడం కలకలం రేపింది., ఈ రిపోర్ట్ చూసి షాక్‌కు గురైన కుటుంబ సభ్యులు వెంటనే మరో నర్సింగ్ హోమ్‌లో పరీక్షలు చేయించగా బాలికకు గర్భం లేదని.చిన్న ఆరోగ్య సమస్య మాత్రమే, ఉందని వైద్యులు నిర్ధారించారు.,దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు.స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి వైద్యుడిని నిలదీసి దాడికి పాల్పడ్డారు., ఇలాంటి తప్పుడు రిపోర్టులు కుటుంబాలను మానసికంగా కుదేలు చేస్తాయి., ఇలాంటి సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు మండిపడుతున్నారు.ఘటనపై పెద్ద ఎత్తున చర్చ, వైద్య నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి., సంబంధిత అధికారుల దృష్టికి విషయం చేరింది., స్కానింగ్ సెంటర్‌పై విచారణకు అవకాశం., ఈ ఘటనతో ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్ల. పనితీరుపై మరోసారి ప్రశ్నలు లేవుతున్నాయి.



## అస్తవ్యస్తంగా మారిన రాజ్‌పుత్‌వాడ వీధులు

**మన దునియా,హనుమకొండ,మార్చి 25:**



హనుమకొండ 10వ డివిజన్‌లోని రాజ్‌పుత్‌వాడ కాలనీలో రోడ్ల మరమ్మత్తుల పేరుతో తవ్విన సైడ్ డ్రైనేజీలు (కాలువలు) పునరుద్ధరించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 30 రోజులుగా పనులు నిలిచిపోవడంతో కాలనీ వీధులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి.డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ పలుమార్లు సూచించినప్పటికీ పనులు పునఃప్రారంభం కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.డ్రైనేజీలు బంద్‌గా ఉండటంతో దుర్వాసన వ్యాపించి, రోజువారీ అవసరాలకే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది.తక్షణమే పనులు పూర్తి చేసి కాలనీలో సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## ముగిసిన 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి దారెటు**

**మన దునియా,హైదరాబాద్:మార్చి 25**



జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారు" అని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నా మని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లేక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. బుధవారం 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం ఈరోజు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు ఇవ్వాళ జీవన్‌రెడ్డి, రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

## వంటగ్యాస్ బుకింగ్ గడువు మళ్లీ పెంపు !

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి25**

దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల కొరత ఉన్న సంగతి తెలిసిందే. ఈ సిలిండర్ల కొరత కారణంగా దేశ వ్యాప్తంగా ఉన్న హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లన్నీ మూత పడిపోయాయి.యుద్ధం నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పటికే సిలిండర్ల కొరత ఉన్న నేపథ్యంలో వంట గ్యాస్ బుకింగ్ రూల్స్ ను ఆయిల్ కంపెనీలు మరింత కఠిన తరం చేశాయి. డబుల్ సిలిండర్ ఉన్నవాళ్లు 35 రోజుల తర్వాతే రీఫిల్ బుక్ చేసుకోవాలని స్పష్టం చేశాయి.అదే సమయంలో సింగిల్ సిలిండర్ ఉన్నవాళ్లు 25 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని సూచనలు చేశాయి ఆయిల్ కంపెనీలు. ఇక అటు ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉన్న వినియోగదారులు మాత్రం ప్రతి 45 రోజులకు ఒక సిలిండర్ బుక్ చేసుకోవాలి. పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులకు కూడా ఈ రూల్ వర్తిస్తుంది. రూల్స్ కు అనుకూలంగా బుకింగ్ చేసుకోకుండా, అంతకంటే ముందుగా గ్యాస్ బుకింగ్ చేస్తే సిస్టం ఆటోమెటిక్ గా బ్లాక్ చేస్తుందని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# కాంగ్రెస్ పార్టీకి టీ.జీవన్ రెడ్డి రాజీనామా!

**మన దునియా,జగిత్యాల జిల్లా:మార్చి 25**



జగిత్యాల జిల్లాకు చెందిన మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి. జీవన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీతో నాలుగు దశాబ్దాల రాజకీయ బంధానికి జీవన్ రెడ్డి తెగదెంపులు చేసుకున్నారు. రాజీనామా విషయంలో కాంగ్రెస్ అధిష్టానం నేతలు చివరి వరకు బుజ్జగించారు. అయినా జీవన్ రెడ్డి రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. జగిత్యాలలో తన అనుచరులు, కార్యకర్తలతో నిర్వహించిన కీలక సమావేశం అనంతరం జీవన్ రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. తన రాజీనా మా లేఖను ఏఐసీసీ మరియు పీసీసీ కార్యాలయాలకు పంపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా నాకు సంతోషం లేకుండా చేశారు. గత 20 నెలలుగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు లేదని, ఆత్మగౌరవం లేని చోట కొనసాగడం కంటే తప్పుకోవడమే మేలని భావించినట్లు జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతానికి పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి, తదుపరి ఏ పార్టీలో చేరబోతున్నారు? లేదా స్వతంత్రంగా ముందుకు సాగుతారా? అన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జగిత్యాల నియోజకవర్గంలో ఆయన భవిష్యత్ కార్యాచరణపై త్వరలోనే స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

# భార్యపై కోపంతో రెండేళ్ల కూతురుని కడతేర్చిన తండ్రి

- **సపోటా పండులో ఎలుకల మందు కలిపి హత్య, అనంతరం తాను ఆత్మహత్యాయత్నం**

**మన దునియా,యాదాద్రి భువనగిరి జిల్లా:లక్ష్మమ్మగూడెం: మార్చి 25**




యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లక్ష్మమ్మగూడెంలో తమ కూతుళ్లు మేఘన(2), మయూరి(9 నెలల)తో నివసిస్తున్న రవి, స్వాతి అనే దంపతులుభార్యాభర్తల మధ్య గొడవల కారణంగా, మూడు నెలల క్రితం చిన్న కూతురిని తీసుకుని స్వాతి పుట్టింటికి వెళ్లగా, తండ్రితో ఉంటున్న పెద్ద కూతురు పెద్ద కూతురుని కూడా తన వద్దకే పంపాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా, పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు జరిపిన దంపతులు, వారి కుటుంబ సభ్యులు పరువు పోయిందనే కోపం, కూతురు దూరం అవుతుందనే బాధలో, తన పెద్ద కూతురుకి సపోటా పండులో ఎలుకుల మందు కలిపి ఇచ్చి, తాను కూడా ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రవి గమనించిన కుటుంబ సభ్యులు వారిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందిన చిన్నారి, రవి పరిస్థితి విషమం భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు -- వదంతులను నమ్మవద్దు

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్**


**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:మార్చి 25**



జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ, ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించుకోవడం వల్ల అనవసర రద్దీ, అంతరాయం ఏర్పడుతున్నదని తెలిపారు.జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా కూడా నిరంతరంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని షేర్ చేయడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేపడితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


# వ్యవసాయ మార్కెట్ వరుసగా మూడు రోజులు బంద్


**మన దునియా, వాజేడు:మార్చి25**




వరంగల్ వ్యవసాయ మార్కెట్ శుక్రవారం శ్రీరామనవమి ప్రభుత్వ సెలవుగా ప్రకటించడం జరిగింది శనివారము ఆదివారము వారాంతము సెలవులు వచ్చినవి దీన్ని దృష్టిలో పెట్టుకొని సమస్త రైతులందరూ మూడు రోజులు సెలవులు ముగించుకొని మళ్ళీ తిరిగి 30:3:2026 సోమవారం రోజున మార్కెట్ ప్రారంభమగును గత మూడు రోజులు కూడా మిర్చి ని రైతులు ఎవరు సర్కుని వారు వారి కల్లాల దగ్గర జాగ్రత్తగా భద్రపరచుకొని తిరిగి సోమవారం రోజు మార్కెట్కు తీసుకుని రాగలరు ఇట్టే విషయంలో మార్కెట్ కమిటీకి సహకరించగలరని కోరడమైనది

# పోలీస్ మెగా మెడికల్ క్యాంప్ 6200 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలు




**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:మార్చి 25**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆధ్వర్యంలో, అడవి ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో మార్చి 25, బుధవారం రోజున పోలీస్ మెగా మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ూతీతీఱజవ ూశ్రీఱజవ" కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు కూడా నిర్వహించామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మెడికల్ క్యాంపులు కొనసాగిస్తామని తెలిపారు.ఈ క్యాంప్ ద్వారా సుమారు 6200 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందించబడ్డాయి.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ (హైదరాబాద్), ఏకశిల హాస్పిటల్ (హనుమకొండ), సిగ్మా హాస్పిటల్, కూరపాటి హాస్పిటల్స్, శరత్ లేజర్ ఐ కేర్ (హనుమకొండ), భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన వైద్యులు,




జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మొత్తం 34 మంది వైద్యులు 9 విభాగాల్లో సేవలు అందించారు.ఈ శిబిరంలో గుండె, మూత్రపిండాలు, జనరల్ మెడిసిన్, స్త్రీరోగాలు, కంటి, చర్మ, చెవి-ముక్కు-గొంతు, ఎముకలు మరియు కీళ్ల సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించబడ్డాయి. అదనంగా రక్త పరీక్షలు, 2డి ఎకో,ఈసిజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ శ్రీదేవి, డీఎస్పీ సూర్యనారాయణ, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అందరికీ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# కాంగ్రెస్ పార్టీకి షాక్.. ప్రధాన కార్యాలయం ఖాళీ చేయాలంటూ నోటీసు

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 25**

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్ లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు.కాగా, 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీలించి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

**చారిత్రక ప్రాధాన్యం..**

ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో




భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు.1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు..

# పెట్రోల్, గ్యాస్‌పై ఆందోళన వద్దు: కిషన్ రెడ్డి

**మన దునియా,హైదరాబాద్: మార్చి 25**

పెట్రోల్, గ్యాస్‌పై ఆందోళన వద్దు: కిషన్ రెడ్డి తెలంగాణకు పెట్రోల్, గ్యాస్ సరఫరాపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీతో మాట్లాడినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పూరీ హామీ ఇచ్చారని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎల్పీజీ సరఫరాను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెట్రోల్ కొరత సృష్టించేవారిపై, వదంతులు వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



# హాస్టల్ సదుపాయాలపై మండల స్పెషల్ ఆఫీసర్ వి. రాజేశ్వర్ ఆకస్మిక తనిఖీ







**మన దునియా,కొత్తగూడ,మార్చి 25:**

జిల్లా విద్యాశాఖ అధికారి మరియు కొత్తగూడ మండలానికి స్పెషల్ ఆఫీసర్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వి. రాజేశ్వర్ ఈ రోజు కొత్తగూడ మండలం పరిధిలోని ఎహెచ్ఎస్ సాదిరెడ్డి పల్లె హాస్టల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, భోజన నాణ్యత, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా టాయిలెట్ల పనితీరు, పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేసి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. హాస్టల్ సిబ్బంది హాజరు విధానం, వారి పనితీరును సమీక్షించి, విధుల్లో నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహణను పరిశీలించి, రికార్డులు క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, శుభ్రమైన వాతావరణం, సురక్షిత నివాసం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నూతన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నియమాలను కచ్చితంగా పాటిస్తూ హాస్టల్ నిర్వహణలో నాణ్యత పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 29న పాలిటెక్నిక్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

**మన దునియా,వరంగల్:మార్చి 25**

వరంగల్ మహానగరంలో ప్రఖ్యాతిగాంచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్థాపన జరిగి 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 29న ఆదివారం ప్లాటినం జూబ్లీ (1955–2026) వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఈ.వి.శ్రీనివాస్ రావు తెలిపారు. ఈమేరకు బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులతో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ.వి.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం దేశ విదేశాలలో వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ ఈ వేడుకలకు ఆహ్వానించడం జరిగిందని, వారంతా ఈ వేడుకలకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని, అదేవిధంగా ఐఏఎస్ అధికారులు దేవసేన, చాహత్ బాజ్పాల్, కర్నాటి వరుణ్ రెడ్డిలు గౌరవ అతిథులుగా పాల్గొంటారని వివరించారు. కళాశాలలో విద్యనభ్యసించిన వారిలో ఐఏఎస్ అధికారులు, ఎన్.ఆర్.ఐలు, వివిధ రంగాలలో స్థిరపడిన వారు ఉన్నారని వారందరూ ఈ




వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ. 28 కోట్ల నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఈ.వి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మేకల అక్షయ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, జి.మహేందర్ రెడ్డి, జయశ్రీ , కె.వెంకటేశ్వర్లు, దొడ్డిపల్లి కుమార్, గన్ను సురేందర్, శశిధర్, ఎం.భిక్షపతి, ఎం.ప్రకాశ్, బి.విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రి (ఎంజీఎం)లో నిర్లక్ష్యం బయటపడింది.





మృతదేహాలను తరలించే అంబులెన్స్ వాహనం లేక ఆటోలో తరలించిన వైనం చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళ. మన దునియా ప్రతినిధి కమలాపూర్ బచ్చల శ్రీకాంత్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళ మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్వతగిరి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన మహిళ మృతి చెందగా, ఆసుపత్రిలో మృతదేహాలను తరలించే వాహనం అందుబాటులో లేక చివరకు ఆటోలోనే ఇంటికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కొరతపై ఆగ్రహం అంబులెన్స్ సౌకర్యం లేక పేద కుటుంబాల ఇబ్బందులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న వైద్య వ్యవస్థపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పేదల సొంతింటి కలను సాకారం చేయాలి

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలి**

**అసెంబ్లీలో గట్టిగా స్వరం వినిపించిన ఎమ్ ఎల్ ఏ**

**మన దునియా ప్రతినిధి కమలపూర్, బచ్చల శ్రీకాంత్**



గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే కేటాయించాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు అందకుండా ఉండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హుజురాబాద్ పట్టణంలో 500 ఇళ్లు, కమలాపూర్‌లో 350, మరిపెల్లి గూడెంలో 50, జమ్మికుంట మండలం ధర్మారం గ్రామంలో 200, బూజునూర్ గ్రామంలో 50 ఇళ్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని సభలో వివరించారు. వీటిని తక్షణమే అర్హులైన పేదలకు అందించి వారి సొంతింటి కలను నిజం చేయాలని కోరారు. అదేవిధంగా, జమ్మికుంట పట్టణంలో నిర్మాణంలో ఉన్న మరో 300 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 30 శాతం నిధులు విడుదల చేస్తే అవి కూడా త్వరగా పూర్తై పేదలకు అందుతాయని ఆయన సూచించారు. దీనిపై స్పందించిన సంబంధిత శాఖ మంత్రి, వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కౌశిక్ రెడ్డి చూపుతున్న చొరవపై ప్రజలు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదల ఇళ్ల సమస్యకు త్వరలోనే శుభవార్త వస్తుందన్న ఆశతో అందరూ ఎదురుచూస్తున్నారు.

## ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ గా ,మల్లం. వెంకటేశం గౌడ్

**బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు**


**మన దునియా ప్రతినిధి కమలాపూర్ బచ్చల శ్రీకాంత్**



హయత్నగర్ పట్టణానికి చెందిన మల్లం వెంకటేశం గౌడ్ మోటివేషనల్ స్పీకర్గా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. శని ఆది, సోమా వారాల్లో నల్గొండ లోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంపా. నాగేశ్వర్ రావు చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్గా సర్టిఫికెట్ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ఇంపాక్ట్ హెడ్ బోర్డు మెంబెర్ నూనె. సుదర్శన్ నల్గొండ రీజియన్ 2 ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్, కోటా కవిత నారాయణ,సరిత గూడూరు అంజిరెడ్డి, వీరవెల్లి శ్రీలత, హర్షిత, , రవీంద్ర రెడ్డి నందికొండ,రవీంద్ర చారి, బాలు, సరిత మొదలగు ట్రైనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లం. వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఢ యువతకి ప్రేరణ కలిగించి వారి లక్ష్యాలు సాధించే విధంగా జ్ఞాన నైపుణ్యాలు అందించడం,నవ భారత నిర్మాణం లో తన దైన శైలిలో సమాజ సేవతో దేశాభివృద్ధిలో పాల్గొనడం తన కర్తవ్యం అని తెలియజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 30 ట్రైనర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గురూజీ గంపా నాగేశ్వరరావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గునిపర్తి గ్రామంలో రోడ్డు ప్రమాదం, ఆటో బోల్తా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**మన దునియా ప్రతినిధి కమలాపూర్ బచ్చల శ్రీకాంత్**





కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం,, నడికూడా మండలం కంటాత్మకూర్ గ్రామానికి చెందిన సాదు మురళి కృష్ణ (42) తన ఆటోలో అంబాల నుండి కంటాత్మకూర్ వెళ్తుండగా అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మురళి కృష్ణకు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ఉన్న మరో నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి పుల్లబాలు, పైలెట్ రాము సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం బాధితుడిని హుటాహుటిన ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో కొంతసేపు ఆందోళన నెలకొంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఉగ్ర కుట్ర కేసు... హైదరాబాద్‌కు చెందిన మహిళ అరెస్ట్

**మన దునియా,హైదరాబాద్: మార్చి 25**




ఉగ్ర కుట్ర కేసు... హైదరాబాద్‌కు చెందిన మహిళ అరెస్ట్ ఆంధ్రప్రదేశ్ : విజయవాడ ఉగ్రవాద లింకుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయీదా బేగం అనే మహిళను కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమెను విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఫారిన్ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్ ద్వారా సోహైల్ బేగ్, షరీఫ్, డానిష్‌లను తీవ్రవాద సంస్థల వైపు మళ్లించడంలో సయీదా బేగం కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# మహిళా రేషన్ డీలర్లపై కక్ష సాధింపు..!!

**ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడి వికృత చేష్టలు?**

**మన దునియా,ఖిలా వరంగల్: మార్చి 25**

వరంగల్ జిల్లాలో రేషన్ డీలర్ల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఖిలా వరంగల్ మండల రేషన్ డీలర్ అధ్యక్షుడు తన పదవిని దుర్వినియోగం చేస్తూ సహచర మహిళా డీలర్లపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడని పలువురు డీలర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. డీలర్ల వాదన ప్రకారం, ఒక అధికారి అండతో మండల అధ్యక్షుడు తనకు అనుకూలంగా వ్యవహరించని డీలర్లను లక్ష్యంగా చేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తనకు నచ్చిన వారికి మద్దతు ఇవ్వడం, వ్యతిరేకంగా ఉన్నవారిపై అనవసర తనిఖీలు, ఒత్తిడులు పెంచడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. మహిళ డీలర్ల వాంగ్మూలం ప్రకారం, తనకు అనుకూలంగా కమిషన్ ఇచ్చే డీలర్లకు మాత్రమే 6గూ కింద కేటాయింపులు చేస్తూ, మిగతా వారికి అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనితో పాటు ఖిలా వరంగల్ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కూడా ఈ వ్యవహారంలో అధికారికి సహకరిస్తున్నాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా విచిత్రమేమిటంటే, తనిఖీల పేరుతో రాత్రి 7 గంటల తర్వాత మహిళ డీలర్ల ఇళ్లకు లేదా దుకాణాలకు రావడం, వారిని ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా విధవరాలైన మహిళ డీలర్లను లక్ష్యంగా చేసుకుంటున్నాడని ఆరోపణలు మరింత సంచలనంగా మారాయి. అంతేకాకుండా, కొన్ని సందర్భాల్లో అధికారిని వెంటబెట్టుకొని తన ప్రభావాన్ని చూపిస్తూ ఇతర డీలర్లపై భయాందోళనలు సృష్టిస్తున్నాడని బాధితులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో మండల అధ్యక్షుడే ప్రధాన పాత్ర పోషిస్తున్నాడని వారు స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల నిజాయితీగా పనిచేస్తున్న డీలర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, తమపై జరుగుతున్న అన్యాయంపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరిపించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో, మహిళ డీలర్లు కలెక్టర్‌ను ఆశ్రయించి, "మాకు న్యాయం చేయండి.. భద్రత కల్పించండి.. అధికార దుర్వినియోగాన్ని ఆపండి" అంటూ వేడుకుంటున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది చూడాలి.

# ఫోన్ పేలో 10వేలు.. స్క్రీన్‌షాట్‌తో బయటపడిన వ్యవహారం..!


**సివిల్ సప్లై అధికారి పై లంచం ఆరోపణలు?**

**ఏసీబీ విచారణకు డిమాండ్**

**పది వేలు సార్ నాకు పంపిండు..**

**నేను మళ్ళీ సార్ కు పంపిన అంటున్న అధ్యక్షుడు..**

**అధ్యక్షుడి ఫోన్ పే వివరాలు తనిఖీ చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి**



**మన దునియా,వరంగల్ జిల్లా: మార్చి 25**


వరంగల్ జిల్లాలో సివిల్ సప్లై శాఖలో సంచలన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సివిల్ సప్లై అధికారికి సంబంధించినట్లు చెప్పబడుతున్న ?10,000 ఫోన్ పే లావాదేవీ స్క్రీన్‌షాట్ బయటకు రావడం కలకలం రేపుతోంది.డీలర్ల వాదన ప్రకారం, రేషన్ డీలర్ అధ్యక్షుడి ద్వారా ఈ డబ్బులు ఫోన్ పేలో పంపించబడినట్లు ఆరోపిస్తున్నారు. ఈ లావాదేవీపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, "ఈ డబ్బులు ఎందుకు తీసుకున్నారు?" అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇదే సమయంలో, డబ్బులు తీసుకున్న తర్వాత కూడా కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది.ఇంకా, ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారి స్పందించిన తీరు కూడా విమర్శలకు దారి తీసింది. "మీరు ఎవరు..? రిపోర్టర్ అయితే అక్రెడిటేషన్ కార్డు పంపండి" అంటూ అహంకారంగా మాట్లాడినట్లు సమాచారం.

మండల అధ్యక్షుడి పాత్రపై అనుమానాలు

ఈ వ్యవహారంలో ఖిలా వరంగల్ మండల రేషన్ డీలర్ అధ్యక్షుడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారితో కలిసి తనకు అనుకూలంగా లేని డీలర్లను టార్గెట్ చేస్తూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడని బాధితులు చెబుతున్నారు. ఏసీబీ విచారణ అవసరం ఫోన్ పే లావాదేవీ స్క్రీన్‌షాట్ బయటకు రావడంతో, ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు."స్క్రీన్‌షాట్‌లో ఉన్న లావాదేవీ నిజమేనా..? దాని వెనుక కారణం ఏమిటి..? అన్నది వెలుగులోకి రావాలి. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని వారు కోరుతున్నారు. ఇప్పుడు ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి నిజానిజాలు బయటపెడతారా..? లేక వ్యవహారం మళ్లీ ముసుగులోనే మిగిలిపోతుందా..? అన్నది చూడాలి.

# ఈ సమస్య ఉన్నా సరైన తిండి తింటే బరువు తగ్గడం పెద్ద కష్టమేం కాదట

పీసీఓఎస్ ఒకసారి వచ్చిన తర్వాత చాలా కాలం పాటు సమస్యలు కలిగిస్తుంది. ఇది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా బరువు పెరగడం చాలా సాధారణం. కొంతమంది మాత్రం బరువు తగ్గలేమనుకుంటారు. కానీ ఇది కరెక్ట్ కాదు. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో బరువును తగ్గించవచ్చు.పీసీఓఎస్ ఉన్న వారిలో ఇన్సులిన్ హార్మోన్ సరిగా పని చేయదు. దీని వలన గ్లూకోజ్ స్థాయిలు పెరిగి శరీరానికి ఇన్సులిన్ తగిన విధంగా స్పందించదు. దీని ఫలితంగా శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఇలా శరీర బరువు పెరుగుతుంది. అయితే ప్రతిరోజూ తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల బరువును తగ్గించవచ్చు.పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియా జీర్ణక్రియను మెరుగుపరచి బరువును నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. కానీ పీసీఓఎస్ ఉన్నవారిలో ఈ మంచి బ్యాక్టీరియా తక్కువగా ఉంటుంది. అందుకే పెరుగు, చద్దన్నం, పచ్చళ్ళు, ఇడ్లీ, దోసె లాంటి పులియబెట్టిన పదార్థాలు తీసుకోవడం మంచిది.ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఎక్కువసేపు ఆకలేయదు. ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. హార్మోన్ల సమతుల్యత కూడా చక్కబడుతుంది. ఫలితంగా బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి. ఓట్స్, బ్రొకోలి, అవకాడో, బెర్రీస్, తృణధాన్యాలు, యాపిల్స్ వంటి ఫలాలు తినడం మంచిది.పీసీఓఎస్ ఉన్నవారిలో శరీర వాపు ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలంగా వాపు ఉండడం వల్ల బరువు పెరగడం జరుగుతుంది. దీన్ని తగ్గించేందుకు మెడిటెరేనియన్ డైట్ ఉపయోగపడుతుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె వంటివి ఉండాలి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను ఆహారంలో చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. కొవ్వులంటే బరువు పెరుగుతుందనే భయం చాలా మందిలో ఉంటుంది. కానీ మంచి కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి. అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, కొబ్బరి నూనె వంటివి తినడం వల్ల ఆకలిని తగ్గించవచ్చు. దీని వలన బరువు తగ్గడం సులభమవుతుంది. కేవలం క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉండాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు లాంటి ప్రోటీన్ ఉన్న ఆహారం తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. ప్రతివారం కనీసం మూడు రోజులు బరువులెత్తే వ్యాయామాలు చేయడం వల్ల నడుము చుట్టూ ఉన్న కొవ్వు కరిగిపోతుంది. పూర్తి నిద్ర, ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయడం వల్ల కూడా బరువు తగ్గడంలో సహాయం చేస్తాయి.



# కొలెస్ట్రాల్ ఉన్న వారు నెయ్యి తినవచ్చా..?

నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. శరీరానికి శక్తి రావాలంటే నెయ్యి తినాలని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. చర్మం, జుట్టు సమస్యలను కూడా నయం చేస్తుంది. నెయ్యి పోషకాలకు పవర్ హౌస్‌గా పేర్కొంటారు. శరీరానికి ఎంతో అవసరమైన విటమిన్-ఎ, విటమిన్-ఇ, విటమిన్-బి విటమిన్ కే తోపాటు విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి.. అంతేకాకుండా.. ఒమేగా -3, ఒమేగా-6 వంటి ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, లినోలిక్, బ్యుటిరిక్ యాసిడ్స్ వంటి పోషకాలు ఉన్నాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రస్తుత కాలంలో కొలెస్ట్రాల్‌తోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు నెయ్యిని తినవచ్చా.. లేదా..? తింటే ఏమవుతుంది..? ఒకవేళ తింటే ఎంత తినాలి.. అనే ప్రశ్నలు సాధారణంగా ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్నాయి. ఆయుర్వేదంలో ఔషధ వినియోగం: నెయ్యిలోని పోషకాలు, విశిష్ట లక్షణాల కారణంగా ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారు. నెయ్యి శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు కూడా నెయ్యి తినవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అయితే.. రోజుకు కేవలం 2 నుంచి 3 స్పూన్లు నెయ్యి మాత్రమే తీసుకోవడం మంచిది.. అంతకు మించి నెయ్యి తీసుకోకూడదని పేర్కొంటున్నారు.కాబట్టి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తపడాలి. చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.. కొలెస్ట్రాల్ ఉన్నవారు ముందుగా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని.. వారి సూచనల ప్రకారం.. నెయ్యిని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఆ రూల్ వద్దు!

'ఇంపాక్ట్ ప్లేయర్'పై పెదవి విరుపు

మెజారిటీ సారథుల అభిప్రాయమదే

ముగిసిన కెప్టెన్సీ మీట్

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో బీసీసీఐ 2023వ సీజన్‌లో ప్రవేశపెట్టి తీవ్ర చర్చనీయాంశమవుతున్న 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై మెజారిటీ కెప్టెన్లు అభ్యంతరం వ్యక్తం చేశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఈ మేరకు 19వ ఎడిషన్‌కు ముందు బీసీసీఐ.. ముంబైలో నిర్వహించిన 'కెప్టెన్సీ మీట్'లో ఎక్కువమంది సారథులు ఈ నిబంధనపై పెదవి విరిచినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. 'ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై బుధవారం బీసీసీఐ నిర్వహించిన కెప్టెన్సీ మీట్ సమావేశంలో వారి అభిప్రాయాలు చెప్పిన కెప్టెన్లలో ఎక్కువమంది దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వారి అభిప్రాయమెలా ఉన్నా బీసీసీఐ ఈ నిబంధనను 2027 దాకా పొడిగించిన నేపథ్యంలో దానిని 20వ సీజన్ తర్వాతే సమీక్షించనుంది' అని ఐపీఎల్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇంపాక్ట్ ప్లేయర్‌తో పాటు 'బాల్ ఛేంజ్', 'ట్రైనింగ్ గైడ్‌లైన్స్'పై చర్చ జరిగినట్టు తెలుస్తున్నది.

ఎవరికీ నచ్చడం లేదు!

ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర్ పటేల్ మట్లాడుతూ.. 'ఒక ఆల్‌రౌండర్‌గా ఈ రూల్‌కు నేను వ్యతిరేకం. కానీ నిబంధనలను పాటించాలి కావున పాటిస్తున్నాం' అని కుండబద్దలు కొట్టి మరోసారి దీనిపై చర్చకు తెరలేపాడు. గతంలో రోహిత్ శర్మ స్పందిస్తూ.. ఈ నిబంధన వల్ల భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్లకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. మరి ఇంతమంది వ్యతిరేకిస్తున్న ఈ రూల్‌పై వచ్చే సీజన్‌లో అయినా బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరం.

తొలి ఇన్నింగ్స్‌లోనే బంతి మార్పు

బీసీసీఐ నిరుటి సీజన్‌లో తీసుకొచ్చిన బాల్ ఛేంజ్ రూల్‌ను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ వర్తింపజేయాలని పలువురు కెప్టెన్లు కోరినట్టు తెలుస్తున్నది. రెండో ఇన్నింగ్స్ పదో ఓవర్ తర్వాత ఫీల్డింగ్ జట్లకు బంతిని మార్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని ఫస్ట్ ఇన్నింగ్స్‌లోనూ వర్తింపజేయాలని కోరినా దీనికి పూర్తిస్థాయి మద్దతు లభించలేదని సమాచారం. అదీగాక బీసీసీఐ ఇటీవల విడుదల చేసిన ట్రైనింగ్ గైడ్‌లైన్స్‌పైనా నాయకులు మరింత స్పష్టత కోరినట్టు తెలుస్తున్నది.

అస్లీ ఐపీఎల్

పేరుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ అయినా విదేశీ ఆటగాళ్లు, అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన సారథులతో జట్లు నిండిపోయేవి. ఆరంభ సీజన్ (2008) నుంచి నిరుటి (2025) దాకా కెప్టెన్సీ మీట్‌లలో భారత ఆటగాళ్లతో పాటు విదేశీ జట్ల క్రికెటర్లూ ఆయా ఫ్రాంచైజీలకు కెప్టెన్లుగా ఈ కార్యక్రమానికి వచ్చేవారు. కానీ ఈ సీజన్‌లో మాత్రం పూర్తిగా పది జట్లకు పదిమంది భారత్‌కు చెందిన ఆటగాళ్లే కెప్టెన్సీ మీట్‌కు హాజరవడం విశేషం.



# ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ టోర్నీ షురూ



హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి స్టేడియం వేదికగా బుధవారం 74వ బీఎన్ మల్లిక్ అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ అట్టహాసంగా మొదలైంది. రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 'క్రీడలు కేవలం శారీరక ధృడత్వానికి కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, పోలీస్ విధులకు ప్రాణాధారం. తెలంగాణ పర్యాటకందేశం నలమూలల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బంది..తమ యూనిఫామ్‌ను పక్కకు పెట్టి, జెర్సీల్లో ఆరోగ్యకరమైన పోటీ కోసం ఒక చోట చేరడం అసాధారణమైన విషయం. భవిష్యత్‌లో ఈ పోటీల్లో మహిళా పోలీసుల భాగస్వామ్యం పెరగాలి. యంగ్ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి కొత్త కార్యక్రమాలతో రాష్ట్రం ప్రపంచస్థాయి అథ్లెట్లకు కేంద్రం కానుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ ఫుట్‌బాల్ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్, స్టార్ ప్లేయర్ గుగులోతు సౌమ్య, డీజీపీ శివధర్‌రెడ్డి, పోలీస్ అకాడమీ డైరెక్టర్లు అభిలాష బిస్త్, అడిషనల్ డీజీపీలు సంజయ్‌కుమార్, అనిల్‌కుమార్, ఐజీ గజరావు భూపాల్, సైబరాబాద్ సీపీ రమేశ్, డీఐజీ అభిషేక్ మహంతి పాల్గొన్నారు.

# సఫారీలదే టీ20 సిరీస్

ఆఖరి మ్యాచ్‌లోకివీస్ ఓటమి



క్రైస్ట్‌చర్చ్: టీ20 ప్రపంచకప్ ఫైనల్ పరాభవం అనంతరం స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ న్యూజిలాండ్‌కు నిరాశ తప్పలేదు. సిరీస్ విజేతను నిర్ణయించే ఆఖరి టీ20లో సఫారీలు.. 33 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తుచేసి సిరీస్‌ను 3-2తో కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. 20 ఓవర్లకు 4 వికెట్లే కోల్పోయి 187 రన్స్ చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ కొనర్ ఎస్తర్‌హ్యూజన్ (33 బంతుల్లో 75, 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌కు తోడు హర్మన్ (39), మల్డర్ (31) రాణించారు. ఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లకు 154/8కే పరిమితమైంది. బెవాన్ జాకబ్స్ (36) టాప్ స్కోరర్. కొయెట్జ్, మల్డర్, బార్ట్‌మన్ తలా రెండు వికెట్లు తీసి సఫారీల గెలుపులో ముఖ్యపాత్ర పోషించారు.

# రాణా స్థానంలో సైనీ




కోల్‌కతా: మెకాలి గాయం కారణంగా ఐపీఎల్-19 నుంచి తప్పుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పేసర్ హర్షిత్ రాణా స్థానాన్ని తన ఢిల్లీ జట్టు సహచర ఆటగాడు నవ్‌దీప్ సైనీ భర్తీ చేయనున్నాడు. ఈ విషయాన్ని ఐపీఎల్ ధృవీకరించింది. రూ. 75 లక్షలతో అతడు కోల్‌కతాకు ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఈ లీగ్‌లో 32 మ్యాచ్‌లు ఆడిన సైనీ.. 23 వికెట్లు తీశాడు.

# ఆర్చర్ల పతక జోరు


**రెండు కాంస్యాలు సొంతం**

**మరో నాలుగు పతకాలు ఖాయం**

బ్యాంకాక్: ఆసియా కప్ వరల్డ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ స్టేజ్-1లో భారత ఆర్చర్లు సత్తాచాటారు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ టోర్నీ రెండో రోజు మన ఆర్చర్లు రెండు కాంస్యాలు గెలుచుకోగా మరో నాలుగు ఈవెంట్లలో ఫైనల్‌కు చేరి పతకాలు ఖాయం చేసుకున్నారు. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీస్ మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి తానిపర్తి చికిత, రాజ్ కౌర్, తేజల్ సాల్వేతో కూడిన త్రయం.. 229-226తో ఆతిథ్య థాయ్‌లాండ్‌పై ఉత్కంఠ పోరులో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది.రాష్ట్ర వార్తలుకానీ పురుషుల కాంపౌండ్ విభాగంలో రజత్, రిషభ్, ఉదయ్ త్రయం.. 233-234తో వియత్నాం చేతిలో పోరాడిఓడింది. కానీ కాంస్య పోరులో 234-232తో భూటాన్‌ను ఓడించి పతకం సాధించింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో జాకర్, కంబోజ్ పసిడి పతక పోరుకు అర్హత సాధించగా చౌహాన్ బ్రాంజ్ మెడల్ మ్యాచ్ ఆడనున్నాడు. మహిళల రికర్వ్ టీమ్ (రుమా బిస్వాస్, కృతి, రిధి) 5-1తో మలేషియాను ఓడించి కాంస్యం నెగ్గింది.




మన దునియా
RNI Number TTI TTI /2023/85680
మన అక్షరం – మన ప్రపంచం



## జైపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. నటి, మోడల్ హర్షిల్ కాలియా దుర్మరణం

ప్రముఖ నటి, మోడల్ హర్షిల్ కాలియా (30) సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమె ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రమైన గాయాలయ్యాయి.సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో జైపూర్‌లోని షిప్రా పత్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, ఆమె నడుపుతున్న కారు ఒక మలుపు వద్ద అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కి బోల్తా పడింది. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, కారును సరిచేసి హర్షిల్‌ను బయటకు తీశారు.వెంటనే ఆమెను సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె తలకు తీవ్ర గాయాలవడంతో చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? లేక మరో వాహనం ఏదైనా ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.హర్షిల్ కాలియా 'క్రైమ్ నెక్స్ట్ డోర్' అనే వెబ్ సిరీస్‌తో పాటు పలు రాజస్థానీ మ్యూజిక్ వీడియోలలో నటించి గుర్తింపు పొందారు. గతంలో ఒక న్యూస్ ఛానెల్‌లో యాంకర్‌గా కూడా పనిచేశారు. ఆమె తండ్రి కూడా ఒక వార్తాపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు సమాచారం.

## 'ధురంధర్ 2'ను ప్రశంసిస్తూ.. బాలీవుడ్‌పై అమీషా పటేల్ తీవ్ర విమర్శలు!

బాలీవుడ్ నటి అమీషా పటేల్ తాజాగా ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన 'ధురంధర్ 2' సినిమాపై ఆమె ప్రశంసల వర్షం కురిపించారు. బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తున్న ఈ చిత్రాన్ని చూసిన అమీషా పటేల్... బాలీవుడ్‌కు ఈ చిత్రం ఒక కనువిప్పు అని అన్నారు.  తన ఎక్స్ ఖాతాలో అమీషా స్పందిస్తూ, "'ధురంధర్' చిత్రాన్ని పరిశ్రమ మొత్తం మెచ్చుకోవడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ బ్రాండ్ అన్ని ప్రశంసలకు అర్హమైనది. ఆదిత్య ఒక 'ప్రాజెక్ట్'ను కాదు, ఒక 'సినిమా'ను తీశారని ఇండస్ట్రీ గ్రహించాలి. పార్టీలలో ట్రెండ్ అయ్యే ఇన్‌స్టాగ్రామర్లను కాకుండా, ప్రతిభ గల నటులను ఆయన ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టులు చేయడం ఆపి, సినిమాలు చేయడం మొదలుపెట్టండి" అంటూ బాలీవుడ్‌కు చురకలు అంటించారు.మార్చి 19న విడుదలైన ఈ చిత్రం కేవలం 6 రోజుల్లోనే భారత్‌లో సుమారు రూ. 500 – 600 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ. 900 కోట్ల మార్కును దాటి, 2026లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. రణవీర్ సింగ్, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు ఈ స్పై థ్రిల్లర్‌లో నటించారు. అమీషా పటేల్‌తో పాటు సూపర్‌స్టార్ రజనీకాంత్, అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి ప్రముఖులు కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.





# దుల్కర్ సల్మాన్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన శృతి హాసన్

వెండితెరపై స్టార్ కిడ్స్‌గా అడుగుపెట్టిన శృతి హాసన్, దుల్కర్ సల్మాన్ తమకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. మరోవైపు, వీరి మధ్య చిన్నప్పటి నుంచే ఒక వింతైన స్నేహం ఉందన్న విషయం తాజాగా బయటపడింది. వీరిద్దరూ చెన్నైలోని ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శృతి... దుల్కర్‌తో తనకున్న స్పెషల్ మెమొరీస్‌ను పంచుకున్నారు.తామిద్దరూ చెన్నైలోని రెండు వేర్వేరు ప్రముఖ పాఠశాలల్లో క్లాస్‌మేట్స్‌గా ఉన్నామని, స్టార్ కిడ్స్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సాధారణంగా పెరిగామని శృతి చెప్పుకొచ్చారు. స్కూల్లో ఉన్నప్పుడు దుల్కర్ తనను 'సోంబి' అని పిలిచి ఆటపట్టించేవాడట. దానికి కారణం.. అప్పట్లో స్కూల్ ఫంక్షన్‌లో శృతి 'సోంబి' అనే పాటను పాడటమే. ఆ పాట విన్నప్పటి నుంచి దుల్కర్‌కు ఆమె పేరు 'సోంబి' అయిపోయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, స్కూల్లో ఉన్న చాలామంది పిల్లలకు ఆమె పేరు శృతి అని కూడా తెలియదట. కేవలం 'కమల్ హాసన్ కూతురు' అని మాత్రమే గుర్తుంచుకునేవారని నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. చిన్నప్పుడు క్లాస్‌మేట్స్‌గా అల్లరి చేసిన ఈ ఇద్దరూ, ఇప్పుడు పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో కలిసి నటించబోతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. దుల్కర్ సల్మాన్ సరసన శృతి హాసన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని సమాచారం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ;   TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com